# మడిలో మది

ఏడుకొండలుకి ముప్పై ఏళ్ళు పైబడ్డాయి. ఓ పెద్ద ఆఫీసులో ఓ చిన్న ఉద్యోగం.

పొద్దున్నే భార్య వేడి వేడిగా వడ్డించిన అన్నం తిని ఎనిమిదింటికి సైకిలెక్కి ఆఫీసుకు వెళ్లిపోతాడు. పదకొండు కిలోమీటర్లు దాటి ప్రయాణం. వయస్సు పెరిగినా అతనికీ ఆమెకీ కూడా ఆ వయస్సు తెలీదు. ఎందుకంటే... కుటుంబ భారం... భారం అనిపించేంత కుటుంబం అతనికి లేవు. పెళ్లయి పన్నెండేళ్లైంది. పిల్లలు కలగలేదని దోర వయస్సులో ఉన్నప్పుడు భార్యతోపాటు బాధ పడ్డాడు. ఆ తర్వాత దేవుడు మనకి ఎంతిస్తే అంతే... అని భార్యతోబాటు సర్దుకుపోయాడు- ఇద్దరు ఒకళ్లకొకళ్లు పిల్లలే.

'నానీ' అని భర్తని ఆమె పిలిస్తే... 'అమ్మలూ' అని భార్యని అతను పిలుస్తాడు.

ఆరోజు... ఆరింటికే తయారయిపోయి సైకిలెక్కాడు ఏడుకొండలు. భార్య అప్పటికే కూర తరిగి, వంట ప్రయత్నంలో పడింది.

"ఇగో అమ్మలూ నే వెళ్తున్నాను" అంటూ వెళ్లిపోతుంటే-

"అదేంటి నానీ! అంత అర్జెంట్... నాకు రాత్రే చెప్పచ్చుగా ఇలా పెంద్రాళే వెళ్తానని. ఇంకా వంట మొదలే పెట్టలేదు నేనూ!" తప్పు చేసినంత సిగ్గుపడుతూ అందామె.

"పొద్దుటే గుర్తొచ్చిందిరా- ఇవ్వాళ కొత్త బాస్ వస్తున్నారు. కొంచెం ఎర్లీగా వెళ్లి ఆఫీసుని ముస్తాబు చేసి వెల్‌కమ్ బోర్డు పెడదామని అనుకున్నాం... నేను జల్దీ వెళ్లాలి... ప్లీజ్. ఏపాటి వీలున్నా ఇంటికొచ్చి లంచ్ చేస్తాను... సరేనా" అన్నాడు అతను.

"వద్దు... ఇంటికొచ్చి... అన్నం తిని వెళ్లడానికి ఇరవై రెండు కిలోమీటర్లు సైకిల్ తొక్కాలి... వద్దు! కూర రాత్రికి వండుతాను. నేను నా యిష్టం వచ్చినది వండుకుని తింటాను పొండి" ఆమె మాటల్లో ఆప్యాయతా, ప్రేమా వీటితోబాటు ఓ చమత్కార భరితమైన జాణతనమూ ఉంది.

'ఆడాళ్లూ.. మీకు జోహార్లు' అని అనుకుంటూ... సైకిలెక్కి భార్య మాటలో షేడ్స్ అన్నీ మనసుకి తెచ్చుకుంటూ... తృప్తిగా ఇంటి నుండి మెయిన్ రోడ్ ఎక్కాడు ఏడుకొండలు

+ + +

కొత్తాఫీసరు రావటానికి ముందు ఏడుకొండలు ఆయన టేబుల్ సరిచేసి, సర్దేసి దుమ్మూ ధూళీ లేకుండా సెట్ చేసేప్పటికి మిగిలిన

సిబ్బందంతా ఫుల్ అటెండెన్స్!!

పన్లో పనిగా వాళ్ల టేబుళ్లన్నీ ఏడుకొండలు చేత పరమ నీట్‌గా పెట్టించుకున్నారు.

కొత్తాఫీసరు గురించి రకరకాల ఊహాగానాలు-

వచ్చేవాడు చాలా స్ట్రిక్టట!

స్ట్రిక్టేకాదు చాదస్తుడట!

పేరుకు తగ్గట్టే నరసింహంట!!

"రిటైర్మెంట్ దగ్గర పడిందని ప్రమోషన్ పడేసి ఈ ఆఫీసుకు పడేశారుట. పదినెల్లు ఓపిక పడితే ముగింపు సభ చేసేయచ్చు" అన్నాడు ఏసుబాబు.

"ముగింపు సభ అనకూడదండీ సారూ... వీడ్కోలు సభ అనాలి" అన్నాడు ఏడుకొండలు.

పరమేశం... ఆయన దిగిన హోటల్‌కి వెళ్లి రిసీవ్ చేసుకోవడానికి తయారౌతూ "ఓరే ఏడుకొండలూ నువ్ కూడా రా. ఏదన్నా సూట్‌కేసూ బ్రీఫ్‌కేసూ తెచ్చి మోయిస్తాడేమో..."

ఏడుకొండలు తమాషాగా చూసి "నేనొస్తాన్లెండి నాకేం నామోషీ లేదు" అని బైల్దేరాడు.

"అటెండర్‌కి... నామోషీలు కుదరవులే.." పరమేశం అక్కసుగా అనేశాడు - ఇద్దరూ కల్సి వెళ్లిపోయారు.

ఏడుకొండలు టేలంటేంటో ఏసుబాబుకి తెల్సు.

ఈ ఉద్యోగంలో చేరేప్పటికి నిజానికతను టెన్త్ ఫెయిల్డ్ కాండిడేట్.

ఆర్థిక ఇబ్బందులు... చదవాలన్న ఆశని ఆపేశాయ్. కొన్ని అప్పులు

తీర్చేసి రెండేళ్లలో టెన్త్ సర్టిఫికేట్ సంపాదించుకున్నాడు. ఆ తర్వాత ఓపెన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ గైడ్‌తో ఆఫీసుకొచ్చేవాడు.. ఎవరెప్పుడు పిల్చినా పరుగెట్టుకెళ్లి ఆ పని చేసొచ్చి సైలెంట్‌గా ఓ మూల కూచుని ఆ గైడు చదివేవాడు. డౌట్లుంటే... ఏసుబాబు తీర్చేవాడు. పరీక్ష దగ్గర పడుతూంటే... "ఓ వారం సెలవు పెట్టేసి ఇంటి దగ్గరే వుండి చదువుకో'' అని సలహా ఇచ్చాడు.

"ఏం పర్లేదు సారూ... మనకివన్నీ మరమరాలే- కరకరమన్నా కమ్మగా దిగిపోతాయ్'' అనేవాడు.

పరీక్షనాడు కూడా సెలవుకూడా పెట్టక్కర్లేకుండా ఆదివారమే పడింది.

రిజల్టొచ్చాక... అందరికీ కూల్‌డ్రింకులిచ్చాడు ఏడుకొండలు.

ఏసుబాబు... చెయ్యి కలిపి షేక్‌హేండిచ్చాడు.

నిజానికి... ఏడుకొండల్తో ఏసుబాబుకి దూరపు చుట్టరికం వుంది. ఇద్దరికీ ఆ సంగతి తెల్సుగానీ.. చెప్పుకోరు- ఆఫీసులో అతను హెడ్ గుమస్తా! ఏడుకొండలు... సార్ సార్ అని పిలవాల్సిన అటెండర్!

ఇంగ్లీష్ మీడియంలో బిఏ చదువుతున్నాడు ఏడుకొండలు.

రెండు ఏళ్లు సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశాడు - వచ్చేనెల ఫైనల్ పరీక్ష- 'బిఏ అయిపోయి డిపార్ట్‌మెంట్ టెస్టు రాసేసి బీసీ క్వాలిఫికేషన్తో వీడు మన పైబాస్ అయిపోతా'డని భయపడి ఉడుక్కుంటారు పరమేశం లాంటివాళ్లు.

కొత్తాఫీసర్, నరసింహంగారొచ్చారు - సఫారీ బట్టలూ తెల్లటి మొఖం, దాని మీదబట్టతల దాకా సాగిన తిలకం గీత.

దానికింద తిరుచూర్ణం చుక్క మడికట్టుకుని గుడికొచ్చినట్టు

ఆఫీసుకొచ్చాడా అనిపించేంత పవిత్రంగా ఉన్నాడు.

ఆయన బ్రీఫ్‌కేసు అందుకోబోతుంటే "నో ప్రాబ్లం నేను మొయ్యగలను" అని ఖండితంగా చెప్పాడట- గురుడు గట్టి పిండమే- అనుకున్నాడు పరమేశం. అందరూ పేర్లు చెప్పి పరిచయం చేసుకున్నారు.

'గుడ్- రైట్- అచ్ఛా-' అంటూ తనకి కావల్సిన వివరాలు అడిగాడు.

మనిషి కొంచెం చాదస్తుడే అనిపించాడు.

"కొంచెం చాదస్తుడు కాడు - చాలా" అనేశాడు ఏసుబాబు ఆయన కేబిన్‌లోకి వెళ్లగానే.

కొందర్ని చూడగానే ఓ ఇంప్రెషన్ ఏర్పడితే ఇంక అది మారదు- పైగా చెడు ఇంప్రెషన్ అయితే పెరుగుతుంది.

నెల్లాళ్లు గడిచేప్పటికి నరసింహంగారు స్టాఫ్ అందర్నీ కాచి వడబోశారు. వాళ్ల వాళ్ల పాత చరిత్రని ప్రస్తుత స్థితినీ చదివేశాడు- తప్పులు చేస్తే చెరిగేసేవాడు- స్టాఫ్ చాటుమాటు మీటింగులెట్టేసుకుని శాడిస్టనీ... ఇంకా ఎక్కువనీ బిరుదులు కనిపెట్టి తిట్టుకునే వారు-

ఏడుకొండలు మాత్రం 'సుఖపడి పోతున్నాను ఆయనొచ్చాక' అనేవాడు.

నిజమే... ఇదివరకుటి బాసుల్లా చీటికీ మాటికీ ఏడుకొండలూ... టీపట్రా... ఏడుకొండలూ... టిఫిన్ పట్రా, ఈ ప్లేటు కడుగు... ఈ కారియర్ కడుగు అని ఈయన సతాయించడు.

ఇంటి దగ్గర ఇంత ముద్ద తినొస్తాడు... మంచినీళ్ల సీసా తెచ్చుకుంటాడు. మనకాయన్తో ఏ పేచీ లేదు.. అని నవ్వుకునేవాడు.

"ఆయన కులగజ్జి అలాంటిది... మన నీళ్లు ముట్టడు... మనని దగ్గరికే రానియ్యడు. ఒక్క కంప్లైంట్‌తో సాయంత్రం నుంచి జైల్లో

చిప్పకూడు తినాల్సిందే" ఏసుబాబు రోషంగా అన్నాడు. కేజువల్‌గా అన్న మాట... సీరియస్‌గానే బుర్రలో ఉడుకుతోంది... ఏసుబాబుకి.

ఏడుకొండలు నవ్వుకున్నాడు -

అంతలో బాసునుంచి ఇంటర్‌కమ్ పిలుపు.

ఏసుబాబు లోపలికెళ్లాడు-

"వాటిజ్ దిస్... నువ్వు నిజంగానే గ్రాడ్యుయేట్‌వా? ఒక డాక్యుమెంట్లో ఇన్ని స్పెల్లింగ్ మిస్టేక్‌లా? ఆ కేలిక్యులేషనైనా కరక్ట్‌గా ఏడిసిందా- సరిచేసి పట్రా"

"ఆఫ్ నాలెడ్జ్‌గాళ్లందరికీ ఉద్యోగాలిచ్చి గవర్నమెంట్ సొసైటీని పాడుచేస్తోంది" తలదించుకుని వస్తున్న ఏసుబాబుకి ఆఖరిమాట బాణం ములుకులా తగిలింది.

క్షణం ఆలస్యం చేయకుండా కంప్లైంట్ తయారు చేశాడు- కులం తక్కువవాడన్నాడని కేసు- అందులో తాను ఇరక్కుండా, ఏడుకొండల్ని వాడుకుంటే... యస్ అదీ కరక్ట్!!!

ఏడుకొండలు పేరు మీద కంప్లైంట్ పేపర్ తిరగరాశాడు.

\+ \+ \+

హెడ్డాఫీసునుంచి ఎంక్వయిరీ బేచ్ వచ్చింది.

ఏడుకొండలుని కులం పేరుతో అవమానం చేశాడని నరసింహంపై అభియోగం- స్టాఫందరూ సంతకం పెట్టారు.

నరసింహం ఆఫీసులో ఎంటరవుతున్నాడు- మామూలుగా ఆయనా ఆయన వాటర్ బాటిలు.

ఏడుకొండలు... మాత్రం ఆఫీసుకి రాలేదు.

ఏసుబాబూ ఇంకా... సంతకం చేసిన అందరూ ప్రత్యక్ష సాక్షికోసం ఎదురు చూస్తున్నారు.

ఆఫీసుకి వచ్చిన నరసింహంగారు... హెడ్ ఆఫీసునుంచి వచ్చిన స్టాఫ్‌ను చూసి ఆశ్చర్యంగా ఆగాడు-

లోపలికి రమ్మని కేబిన్‌లోకి వెళ్తూ వచ్చిన వాళ్లని రెస్పెక్టబుల్‌గా ఇన్వైట్ చేసారు-

"మీరిక్కడే.. వుండండి- ఒక్క నిముషం" అంటూ అతని మీద అభియోగాన్ని చెప్పారు-

ఆ కంప్లయింట్ పేపరు చదివి నవ్వుకున్నాడు.

"ఏడుకొండలు వచ్చి మీ కేసులో సాక్ష్యం చెప్పాకే మీరు డ్యూటీలో కొనసాగుతారు" అన్నాడు పైనుంచి వచ్చిన ఆఫీసర్!

నరసింహం నవ్వాడు- తన జేబులో ఉన్న ఏడుకొండల తాలూకు ఆరోజు లీవ్ లెటర్ అందించాడు వాళ్లకి.

ఏసుబాబు మిగిలిన స్టాఫ్ 'అమ్మ నా కొడుకా బతికిపోయావ్' అనుకున్నారు అక్కసుగా-

"అతన్ని అర్జెంట్‌గా సాక్ష్యానికి పిలవాలంటే... మా ఇంటికి ఫోన్ చేయండి- అతనూ అతని భార్యా మా ఇంట్లోనే ఉన్నారు. మా ఆవిడకి వంట్లో బాగోలేదని వాళ్లు అక్కడే వున్నారు. మేమీ ఊరు వచ్చినప్పట్నుంచి వాళ్లవిడే మాకు వంట చేస్తోంది... ఇవాళ వాళ్లే మా ఇంట్లో వంట"

"మరి మీకు క్యాస్ట్ ఫీలింగ్"

"ఏడుకొండల్ని అడగండి" అని సెల్‌ఫోన్... రింగ్ చేస్తున్నాడు.

ఏసుబాబూ మిగిలిన స్టాఫ్ మొహంలో నెత్తురు చుక్కలేదు.